



కదిలిపోయిన ఫొటోలావుందామె ముఖం. ఏ ఫీచరూ స్పష్టంగా లేదు. ఆమె శరీరమంతా లోతుగా కోసుకుపోయినట్టు ముడతలుపడి, వేసవిలో ఎండి పగిలిన చెరువు గర్భంలావుంది. రెక్కలు కాలిన దీప్పురుగులా అతి అసహ్యంగానూ, అతి దీనంగానూ వుండామె. తనకు అనుక్షణం కన్పిస్తున్న భయంకర చిత్రాన్నేదో చూడదల్చుకోలేనట్టు క్షణక్షణం మాత్రం కనురెప్పలు మూసుకుంటోందామె.

యశోదా, సిరాజ్‌లే పలుకరింపులూ, సానుభూతి వచనాలూ కావిస్తున్నారు. వాళ్ళ ప్రశ్నలకి మనిషో జవాబు చొప్పున చెప్తున్నారు వరండాలోవాళ్ళు బూతులు మినహాయిస్తే వాళ్ళు చెప్పినకథ :

బండతన్ది అక్కడికి దగ్గరేవున్న ఒక పల్లెట. బండేవాడి యాదాస్తీనట. అతనికంటే ముందు పుట్టిన "పంచిపాండవుల్లాటోళ్ళలో నలుగురు సిన్నప్పుడే సెల్లిపోనారు. కడకీ దొక్కడే - దరమరాజులాటోడు - మిగిలినాడు" అతని తండ్రిపోయి "మొన్న చివరేత్తిరికి ఏడో ఏడు సొరబడ్డది" ఆ బండ తనికి మ్ముత్తేలమ్మ—

"అంటే ఓళనుకున్నావ్ ?

"ఆడి మావఁ కూతురు"

"నూర్నొంబరు పంచినాగుంటాంది గుంట"

"అచ్చంగా తను సినీమాల సావిత్తిరే ననుకుంటాంది."

—అంటే మనసైందట, ఆ గుంటకి యీ ముసిల్దంటే ఒళ్ళు మంటట. ఈ ముసిల్దానికి రెండు కళ్ళూ పువ్వులేసి పోయేయట, అంచేత ఆ ముత్తేలమ్మని పెళ్ళాడితే యీ గుడ్డిదానికి "ఏటన్నేయం ఐపోద్దో ఏటోనని, సీముండా! మా యమ్మున్నన్నాళ్ళూ నా కగపడక అనితగిలేసి, యీ రెక్కల్లేని పచ్చిని గూట్లో ఎట్టుకొని ఆ సీరామ సెంద్రుడు" కాలం వెళ్ళపుచ్చుతున్నాట్ట. యిప్పుడీ ముసిల్దానికి "రోజు గోతి తోటనో పాడున్నెయ్యేగతి. యీ ముండకి యిన్ని గంజినీళ్ళోసీ వోళ్ళెవరూనేరు. సస్తే కాటికి కాళ్ళట్టు కీడిసేసే వాళ్ళుకూడా నేరు"

"మరిప్పుడీ ముసల్దేమౌతుంది ?" ఆదుర్దాగా అడిగేఁు సిరాజ్.

ఎవరూ మాటల్ళేదు. వాళ్లనింకా అదిమి పట్టుకుంటున్నట్టు చీకటి కదిలింది. ఈ లోగా చివర్నికూర్చున్నకుర్రాడొకడుముందుకొచ్చేడు. ఆత్మవిశ్వాసంతో నురగలు కక్కుతున్న పందెపు గుర్రంలా, ఎక్కుపెట్టిన బాణంలా వున్నాడు. తనా, పరాతెలియని యవ్వనంలో వున్నాడు. "మావస్తా సచ్చిపోనావా దొరా" అని సిరాజ్‌తో అని. "నెగే, ముసల్దానా! నా నుండగా నీకొచ్చిన బయవేఁన్నేదు" అని ముసల్దానితో అని ఆమెని లేవదీసేడు.

దూరంగా ఒక మెరుపు మెరిసింది.

చీకటి చీలింది.

("ఓ రోజు ఆస్పత్రిలో ఒకే ఒక అతిమంచి సూదిమందు ఉంది. బజార్లో అది స్టాకులోలేదు. అదివ్వకపోతే ఓ గొప్ప పేషెంటు చస్తాడు. అదివ్వకపోతే ఓ పేద పేషెంటూ చస్తాడు. ఆ యిద్దర్లోనూ ఆ మందు ఎవరికివ్వాలి? ఎవరికిస్తారు? అందువల్ల ఫలితాలేవిటి? కథ రాయొచ్చు" అని శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు చేసిన సూచన ఆధారంగా)...